క్లుప్తంగా

రెయ్యి వెంకటరమణకు సత్కారం



రెయ్యి వెంకటరమణను సత్కరిస్తున్న ఆర్‌వీఆర్ యువసేన యూత్

మద్దిపాలెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితుడైన 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణకు అభినందనలు వెల్లువెత్తాయి. వార్డు కార్యాలయంలో శనివారం ఆయనను ఆర్‌వీఆర్ యువసేన యూత్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన పదవికి నూరు శాతం న్యాయం చేస్తానన్నారు.ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన పార్టీ ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పద్యపఠనంపై విద్యార్థులకు అవగాహన



పద్యపఠనం చేస్తున్న విద్యార్థిని

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో పద్యపఠనం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకర్త దత్తి అప్పలనాయుడు రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు పద్యపఠనం వల్ల ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'విశ్వతేజ' విద్యార్థుల ప్రతిభ



స్కూల్ టాపర్ కుసుమాంజలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాస్కరరావు

తాటిచెట్లపాలెం: ఉత్తమ ఫలితాలు, క్రమశిక్షణకు మారుపేరు విశ్వతేజ స్కూల్ అని ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో విశ్వతేజ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. మొత్తం 61 మంది పరీక్షలకు హాజరు కాగా.. నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సుమారు 31 మంది 500కు పైగా మార్కులు సాధించారని, పి.కుసుమాంజలి 589/600 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ సందర్భంగా శనివారం కుసుమాంజలిని ప్రిన్సిపాల్, స్కూల్ సిబ్బంది అభినందించారు. రికార్డు ఫలితాల సాధనలో సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ప్రిన్సిపాల్ భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం, మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ఐఎన్‌టీయూసీ అవతరించిందన్నారు. పలువురు కార్మిక నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ బోగవెల్లి నాగభూషణం, స్టేట్ ఉపాధ్యక్షుడు కొండబాబు, తాతబాబు, కేటీ భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.



సీతమ్మధార రైతుబజార్





అదనపు స్టాళ్లతో చిక్కులు

రైతుబజార్‌లో పండ్ల వ్యాపారుల అవస్థలు

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో కొత్త పండ్ల స్టాల్ ఏర్పాటు తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికే తగినంత వ్యాపారం లేక ఆందోళనలో ఉన్న పండ్ల వ్యాపారులకు, బజారు బయట రోడ్డుపై ఉన్న తోపుడు బండ్ల వ్యాపారానికి తోడు, కొత్తగా స్టాల్ ఏర్పాటు చేయడం గమనార్హం. ఇది మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బజారులో నాలుగు పండ్ల స్టాళ్లు ఉండగా, 2023లో తొలిసారిగా ఒక స్టాల్, 2024లో రెండు స్టాళ్లు ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది మరో రెండు స్టాళ్లు రావడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఏర్పాటైన ఈ స్టాల్‌లో బత్తాయి, యాపిల్, ఆరంజ్ వంటి పండ్లు విక్రయిస్తుండటంతో, అవే పండ్లు అమ్ముతున్న ఇతర వ్యాపారులు తమకు సరైన గిరాకీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త స్టాల్ ఏర్పాటు తమ వ్యాపారానికి గండి కొట్టడమేనని వారు ఆందోళన చెందుతున్నారు. రైతుబజార్‌లో ప్రస్తుతం ఐదు వరకు పండ్ల స్టాళ్లు ఉన్నాయి. ఈ వ్యాపారులు వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ మార్కెట్ నుంచి పండ్లు కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. అరటి, బత్తాయి, ఆరంజ్, జామ, ఉసిరి, ద్రాక్ష వంటి పలు రకాల పండ్లు అన్ని స్టాళ్లలోనూ అందుబాటులో ఉన్నాయి. అయితే, స్టాళ్లు ఒకదానికొకటి దగ్గరగా ఉండటంతో వ్యాపారాలు సరిగా సాగడం లేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా గురువారం ఐదో స్టాల్ ఏర్పాటు చేయడంతో మిగిలిన వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అద్దెలపైనే దృష్టి

మార్కెటింగ్ శాఖ అధికారులు అద్దెలపైనే దృష్టి పెట్టి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారని వ్యాపారులు విమర్శిస్తున్నారు. అవసరం ఉన్న బజార్లలో ఏర్పాటు చేయకుండా, నిత్యం ఇరుకుగా ఉండే సీతమ్మధార రైతుబజార్‌లో ఐదో స్టాల్ వేయడం గమనార్హం. గత ఏడాది నాలుగో స్టాల్ ఏర్పాటు చేశారని, ఒక్కో స్టాల్‌కు నెలకు రూ.6 వేలు అద్దె చెల్లిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. అధిక మొత్తంలో పండ్లు తెస్తున్నా అమ్మకాలు లేవని వారు వాపోతున్నారు. బజారులో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపై వెళ్లేవారు తోపుడు బండ్ల వద్ద కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. అప్పులు చేసి వ్యాపారం చేస్తున్నా, స్టాళ్ల సంఖ్య ఏటా పెరగడంతో గిట్టుబాటు కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో స్టాల్‌లో రోజుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.10 వేల లోపు మాత్రమే వ్యాపారం జరుగుతోందని చెబుతున్నారు. ఐదో స్టాల్ రావడంతో తమ టర్నోవర్ మరింత తగ్గుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. అన్ని స్టాళ్లలో ఒకే రకమైన పండ్లు ఉండటం, స్టాళ్ల మధ్య తగినంత ఖాళీ లేకపోవడంతో వ్యాపారానికి ఆటంకం కలుగుతోందని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ స్పందించి కొత్త స్టాళ్లకు అనుమతులు నిలిపివేయాలని, ఉన్న స్టాళ్ల మధ్య తగినంత ఖాళీ ఉండేలా చర్యలు తీసుకోవాలని పండ్ల వ్యాపారులు కోరుతున్నారు.



సీతమ్మధార రైతుబజార్‌లో పండ్ల స్టాల్

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల వల్లే..?

స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగానే సీతమ్మధార రైతుబజార్‌లో పండ్ల దుకాణాల సంఖ్య పెరుగుతోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కొందరు వ్యాపారులు అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫారసులతో మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రసన్నం చేసుకుని ఇక్కడ పండ్ల స్టాళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారని, ఇది తమ వ్యాపారాలను దెబ్బతీస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి, మార్కెటింగ్ శాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న బీడీఎఫ్‌ఐ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, చందు

కంచరపాలెం: ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఏడో నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోటీలకు జిల్లా నుంచి బీడీఎఫ్‌ఐ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, కోచ్‌లు మణి, ఆదినారాయణ ప్రాతినిధ్యం వహించారు. ఈ చాంపియన్‌షిప్‌లో జిల్లా బాక్సింగ్ విజేతలను శనివారం కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో ఘనంగా సత్కరించారు. నేషనల్ బాక్సర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్‌తో పాటు చాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించిన విజేతలను నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, ఏయూ డాక్టర్ గొట్ల కృష్ణారెడ్డి, మెడికల్ అధికారి డాక్టర్ సునీత ఘనంగా సత్కరించారు. జాతీయ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో రాష్ట్ర బాక్సర్లకు వివిధ కేటగిరీల్లో మొత్తం 34 బంగారు, 14 వెండి పతకాలు లభించాయని బీడీఎస్‌ఐ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వొజర్లు సి.సాయిసతీష్, పి.గణేష్, ఆర్‌వోసి రుబిన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి విశేష పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతమ్మధారలో కొత్త పెట్రోల్ బంక్‌కు బ్రేక్?



పెట్రోల్ బంక్ కోసం చదును చేసిన స్థలం

సీతమ్మధార: సీతమ్మధార ప్రాంతంలో రెండో పెట్రోల్ బంక్ వస్తుందన్న ఆశలు అడియాశలవుతున్నాయని సమాచారం. ఇక్కడ కొన్ని రోజులుగా బంక్ ఏర్పాటు పనులు జోరుగా జరిగాయి. ఈ ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండో పెట్రోల్ బంక్ మంజూరవడం తెలిసిందే. పౌర సరఫరాల సంస్థ ఇప్పటికే సీతమ్మధార ప్రెస్‌క్లబ్ పక్కన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నిర్వహిస్తోంది. ఇప్పుడు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మరో బంక్‌ను ఏర్పాటు చేయనున్నారని ఏడు నెలల కిందట అధికారులు ప్రకటించారు. ఇక్కడ రెండో పెట్రోల్ బంక్ వస్తే వాహన చోదకులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని భావించారు. ప్రభుత్వమే స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తే కొలత విషయంలో కచ్చితత్వం ఉంటుందని ప్రజలు భావించే అవకాశాలు ఉన్నాయి. కల్తీకి ఆస్కారం ఉండదు. ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం స్థలం చదును పనులు కూడా పూర్తి చేశారు. కాగా, కొత్త పెట్రోల్ బంక్ ఏర్పాటు ప్రతిపాదనలు ఆగిపోయినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కారణంగానే ఇక్కడ పనులు అర్ధాంతరంగా ఆపేశారని సిబ్బంది తెలిపారు. ఈ స్థలంలో మరి ఏ నిర్మాణాలు చేపడతారన్నది తెలియాల్సి ఉంది.

కట్టిన సొమ్ము తిరిగి చెల్లించాలని వినతి



ఆవేదన వెలిబుచ్చుతున్న రామునాయుడు

దాబాగార్డెన్స్: మూడేళ్లు కావస్తున్నా ఇంటి నిర్మాణానికి సంబంధించి ఒక్క రాయి పడలేదు.. పనులు ప్రారంభం కాలేదు సరికదా.. మేము కట్టిన సొమ్ము మాకిచ్చేయండని వేడుకున్నా ఇవ్వడం లేదని ఉత్తర నియోజకవర్గానికి చెందిన చప్ప రామునాయుడు గోడు వెళ్లబోసుకున్నారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. తన తండ్రి చప్ప దేముడు ఆనందపురం మండలం, రామవరం గ్రామం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ఫ్లాట్ కొనుగోలుకు 2022 జూన్ 30న రూ.2 లక్షల 10 వేలు ముందస్తుగా చెల్లించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉందని, ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, ఫ్లాట్ కేటాయింపు కాలేదన్నారు. ఈ విషయమై గత ఏడాది అక్టోబర్ 28న వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఈ ఏడాది జనవరి 20న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ దృష్టికి తీసుకెళ్లానని, ఇప్పటికీ డబ్బులు రాలేదన్నారు. గత మార్చి 28న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్ వద్ద జరిగిన ఓపెన్ వేలంలో సెంట్రల్ పార్క్‌కు ఎదురుగా ఉన్న దుకాణం కోసం టెండరులో పాల్గొనగా పోటీదారులు లేరన్న కారణంతో ఆ వేలం రద్దు చేశారన్నారు. రామవరం ఫ్లాట్‌ను వెంటనే అప్పగించాలని, లేదా డబ్బులు తిరిగి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న వీఎంఆర్‌డీఏ దుకాణాలకు నూతన నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బ్రిడ్జిపై ఆటోల పార్కింగ్‌తో అవస్థలు



ఎంటీసీ పాలెం బ్రిడ్జిపై నిలిపిన ఆటోలు

సీతంపేట: సామాజిక స్పృహ లేకుండా నలుగురు ప్రయాణించే మార్గంలో ఆటోలు పార్కింగ్ చేస్తుండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 44వ వార్డు షాదీఖానా సమీపంలో ముస్లిం తాటిచెట్లపాలెం క్యూబా మసీదుకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా ఆటోలను నిలుపుతున్నారు. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నుంచి ముస్లిం తాటిచెట్లపాలెంలోకి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాపోకలకు వీలు లేక అత్యవసర సమయాల్లో అంబులెన్స్, స్కూల్ పిల్లల ఆటోలు సైతం వచ్చే మార్గం లేక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిడ్జిపై ఆటోలు పార్క్‌చేస్తూ, రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

రహదారిపైకి ఒరిగిన వృక్షం



సీతమ్మధారలో రోడ్డుపైకి ఒరిగిపోయి ఉన్న చెట్టు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధారలోని ఒక మార్గంలో ఒరిగిపోయిన చెట్టు పాదచారులు, వాహన చోదకులను భయాందోళనలకు గురిచేస్తోంది. నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు వెళ్లే మార్గంలో ఒక చెట్టు కొంతకాలంగా బాగా కిందకు ఒరిగిపోయి ఉండటం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు వాపోతున్నారు. భారీ వర్షాలు పడితే చెట్టు కూలిపోవడం ఖాయమని చెబుతున్నారు. ఇటీవల అడపా దడపా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు ఈ చెట్టు ఎక్కడ పడిపోతుందో అని స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. స్థానిక సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ స్పందించి జీవీఎంసీ జోన్–3 హార్టికల్చర్ విభాగం ద్వారా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డాల్ఫిన్ నోస్ కాలనీలో డీఆర్ఎం తనిఖీలు



డాల్ఫిన్‌నోస్ కాలనీలో పర్యటిస్తున్న డీఆర్ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా శనివారం డాల్ఫిన్‌నోస్ రైల్వే కాలనీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్వార్టర్స్‌లో అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. ముఖ్యంగా శానిటేషన్, లైటింగ్, సెక్యూరిటీ, మరియు క్వార్టర్స్ యొక్క ప్రస్తుత పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అనంతరం కాలనీ నివాసితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు మరియు పలు సూచనలు చేశారు. కొన్ని క్వార్టర్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, అవసరమైన మార్పులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (హెడ్ క్వార్టర్స్) జగదీష్, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ అప్పారావు, అలాగే ఎలక్ట్రికల్, సివిల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ

మురళీనగర్: మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ప్రశాంతి పార్కు, వనితా వాకర్స్ క్లబ్, వనమాలి సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు. సోమవారం నుంచి ఆదివారం వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. స్టెయిన్ వుడ్ మ్యూరల్ ఆర్ట్, ఓహెచ్‌పీ షీట్ ఆర్ట్, టార్టోయీస్, గ్లాస్ పెయింటింగ్, 3డీ అవుట్ లైనర్ ఆర్ట్, వెజిటబుల్ పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 5 నుంచి 15 ఏళ్ల వయసు పిల్లలు ఈ శిక్షణలో చేరవచ్చన్నారు. వివరాలకు 94918 54838 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డెక్కిన పుచ్చకాయలు.. పాదచారుల అవస్థలు



నక్కవానిపాలెం రహదారిపై నిల్వ చేసిన కర్బూజా కాయలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం రహదారి మీద కర్బూజా కాయలను డంపింగ్ యార్డును తలపించేలా నిల్వ చేయడంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారి ఫుట్‌పాత్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో ఒక వ్యాపారి దర్జాగా అధిక పరిమాణంలో పుచ్చకాయలు నిల్వ చేయడం గమనార్హం. ఇక్కడి నుంచి రైతుబజార్‌కు వెళ్లే మార్గం కావడంతో రోజూ అధిక సంఖ్యలో ప్రజలు ఈ మార్గం ద్వారానే వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే మార్గంలో కర్బూజాల నిల్వ వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దు



శంకుస్థాపనలో పాల్గొన్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, సనపల వరప్రసాద్

మురళీనగర్: అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సూచించారు. 50వ వార్డు సత్యానగర్‌లో రూ.20 లక్షలతో రక్షణ గోడ నిర్మాణానికి మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. గత నెలలో అకాల వర్షాలకు సత్యానగర్ కొండవాలు ప్రాంతంలోని ఓ ఇంటి గోడ కుంగిపోయిన విషయం తెలిసిందే. దీనిపై స్థానికులు టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఇక్కడ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా వేగవంతంగా చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు కార్పొరేటర్ ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కూటమి నాయకులు సంకు వెంకటేశ్వరరావు, మూల వెంకటరావు, అప్పలకొండ యాదవ్, రంధి ఈశ్వరరావు, బంగారయ్య, రామకృష్ణ, మల్లు నాయుడు, ఆనందరావు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రమంతా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో డీఎస్సీ నిర్వహించాలి



మాట్లాడుతున్న నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్

సీతంపేట: డీఎస్సీ పరీక్షలను నెల రోజుల పాటు కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రోజు ఒక్కో ప్రశ్నాపత్రం ఉండటం వల్ల కష్టమైన పేపర్ వచ్చిన వారు నష్టపోయే అవకాశం ఉందని, మొదటి రోజుల్లో పరీక్ష తేదీ వచ్చిన వారు మిగతా రోజులు ప్రిపరేషన్‌కు సమయం కోల్పోతారని అన్నారు. అందరికీ ఒకేరోజు ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని, డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, 2600 స్పెషల్ డీఎస్సీ పోస్టులను కూడా ప్రస్తుత డీఎస్సీతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్పెషల్ బీఈడీ, డైట్ చదివిన లక్ష మంది నిరుద్యోగులు స్పెషల్ డీఎస్సీ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఏఈఈ పోస్టుల భర్తీలో 30 శాతం ఏపీపీఎస్సీ ద్వారా, 70 శాతం ప్రమోషన్ల ద్వారా చేపట్టాలనే ప్రతిపాదనను వ్యతిరేకించారు. టీటీడీలో ఏఈఈ, ఏఈ, జేటీవో పోస్టులను రాత పరీక్ష ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సుధీర్, లక్ష్మణరావు, పురంధరి, అన్వేష్ పాల్గొన్నారు.

9న మెగా జాబ్ మేళా

పెందుర్తి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 250 కంపెనీల్లో కొలువుల కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని..నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.